క్లుప్తంగా

గర్భిణులకు మధ్యాహ్న భోజనం

రేగిడి: వైద్య తనిఖీల నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంగళవారం విచ్చేసిన గర్భిణులకు నారాయణ సేవ పేరిట స్థానిక సత్యసాయి భజన మండలి సభ్యులు మధ్యాహ్న భోజనం అందజేశారు. ప్రతినెలా తనిఖీల కోసం వస్తున్న గర్భిణులకు సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇలా భోజనం అందిస్తున్నామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి అసిరినాయుడు, భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: పంచాయతీలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని అంతకాపల్లి గ్రామ సచివాలయంలో వీఆర్ అగ్రహారం గ్రామ పంచాయతీకి చెందిన 2023–24 రికార్డులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సంబంధించిన అన్ని రికార్డులు పూర్తి స్థాయిలో ఉండాలని తెలిపారు. ఎప్పటికప్పుడు రికార్డులు అప్‌డేట్ చేస్తూ ఉండాలన్నారు.

తక్షణమే ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ

రాజాం సిటీ: ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను తక్షణమే తప్పకుండా నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ వెనక ఉన్న కళావేదికలో ఆ పార్టీ రాజాం నియోజకవర్గ స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద చర్యలు, కార్పొరేట్ శక్తులకు దేశంలోని వ్యవస్థలను కారుచౌకగా కట్టబెట్టే విధానాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. అలాగే రాష్ట్రంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలుచేయకపోతే నిలదీయాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, నాయకులు చాపర సుందర్‌లాల్, అలమండ ఆనందరావు, బుగత అశోక్, సింగారపు కనకరాజు పాల్గొన్నారు.


జోరుగా వరి ఉబాలు



తెర్లాం: అప్పలంపేటలో ఉబాలు వేయడంలో నిమగ్నమైన మహిళా కూలీలు

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో వరి ఉబాలు జోరుగా జరుగుతున్నాయి. తోటపల్లి ప్రధాన కుడికాలువ ద్వారా పిల్లకాలువలకు సాగునీరు రావడంతో మండలంలోని ఆమిటి, కొల్లివలస, కొరటాం, గొలుగువలస, చినగొలుగువలస, నెమలాం, సుందరాడ, ఉద్దవోలు, గంగన్నపాడు, తెర్లాం తదితర గ్రామాల్లో వరినాట్లు వేయడం(ఉబాలు) ముమ్మరం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో అనుకూల వాతావరణం ఉండడంతో ఉబాలు ముమ్మరంగా జరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం

వంగర: మండలంలోని కొప్పర గ్రామ సమీపంలోని పొలాల్లో ఉన్న ఓ విద్యుత్ స్తంభం ఓ పక్కకు ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. అటువైపుగా వెళ్తున్న వారు ఎప్పుడు పడిపోతుందో ఏం ప్రమాదం జరుగుతోందనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సాగునీటి కాలువకు గండి

వంగర: పార్వతీపురం మన్యం జిల్లా, గరుగుబిల్లి మండలంలోని శివ్వాం గ్రామ సమీపంలోని కుడి కాలువకు గండి పడడంతో సాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మండలంలోని వీవీఆర్ పేట, రాజులగుమ్మడ, బంగారువలస, కొప్పరవలస, కె.కొత్తవలస, రుషింగి, తలగాం గ్రామాల్లో దమ్ము పనులు మందకొడిగా సాగుతున్నాయి. అధికారులు స్పందించి, కాలువ గండి పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



బొబ్బిలి: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పర్యవేక్షకులు అరుణ

బొబ్బిలి: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలు జరిపినా, ప్రోత్సహించినా శిక్షార్హులేనని ఐసీడీఎస్ పర్యవేక్షకులు అరుణ తెలిపారు. స్థానిక పట్టణంలోని ఐసీడీఎస్ రెండో సెక్టార్ కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలన, వరకట్న నిషేధంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వరకట్నం దురాచారాన్ని రూపుమాపుతున్నట్లే బాల్యవివాహాలను కూడా రూపుమాపాలని పిలుపునిచ్చారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం ద్వారా గర్భం దాల్చిన తర్వాత ప్రసవ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఒక్కోసారి మాతాశిశు మరణాలు కూడా జరిగే ఆస్కారం ఉందన్నారు. అలాగే ఆ వయసులో అవగాహన లేమి కారణంగా భార్యభర్తలు విడిపోయేందుకు అవకాశముంటుందన్నారు. ఆడపిల్లలకు 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘ నాయకులు కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన..

రాజాం: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవ అక్రమ రవాణా నిషేధిత చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థల కమ్యూనిటీ సోషల్ వర్కర్లు లక్ష్మీనారాయణ, హరీష్‌లు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా చట్టవ్యతిరేక కార్యక్రమమని, అమ్మాయిలను తరలించడం, మోసగించడమనేది మానవ అక్రమ రవాణా పరిధిలోకే వస్తాయన్నారు. ఎవరూ ఇతరులను నమ్మి మోసపోవద్దన్నారు. మోసం చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాజాం: మానవ అక్రమ రవాణా నిషేధిత చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జగన్‌పై విమర్శలు మాని.. 'సూపర్ సిక్స్'పై నిలదీయమ్మా..

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను ఉద్దేశించి రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.లక్షుంనాయుడు వ్యాఖ్య



మాట్లాడుతున్న రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్షుంనాయుడు

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టార్గెట్‌గా తరచూ విమర్శలకు పాల్పడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తీరును రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు తప్పుబట్టారు. స్థానిక పట్టణంలోని రైతు సంక్షేమ సంఘ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడిన ఆయన.. ఎప్పుడూ తన అన్నయ్య జగన్‌పై షర్మిల విమర్శలు చేయడమే తప్ప ప్రజల కోసం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అన్నపై విమర్శలు మాని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలయ్యేలా చంద్రబాబును నిలదీయాలని హితవుపలికారు. ఎప్పుడైనా అధికారంలో ఉన్న పార్టీని ప్రశ్నించడం మానేసి, ప్రతిపక్షంలో ఉన్న పార్టీని విమర్శించడం తగదన్నారు. తల్లికి వందనం పేరిట ప్రతీ విద్యార్థికి ఏడాదికి 15 వేలు, 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు నెలకు రూ.1500, ప్రతీ ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ పేరిట రైతుకు ఏడాదికి రూ.20 వేల సాయం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి లేదా 20 లక్షల ఉద్యోగాలు వంటి హామీలను కూటమి సర్కారు ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా కాలం వెల్లదీస్తోందని విమర్శించారు. హామీలు ఎగ్గొట్టేలా కనిపిస్తున్న చంద్రబాబును విమర్శించడం మానేసి, జగన్‌ని విమర్శించడం చూస్తుంటే వ్యక్తిగత కక్ష తీర్చుకోవడం కోసమే ఆమె ఉన్నట్లుగా ఉన్నారన్నారు. ప్రజలపై అభిమానం ఉంటే ఇప్పటికైనా ప్రజల తరఫున పోరాటానికి సిద్ధం కావాలన్నారు. సూపర్ సిక్స్ హామీలను చంద్రబాబు ప్రభుత్వం అమలుచేసేలా ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు అప్పలనాయుడు, కూర్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వండి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి డిమాండ్



ఎంఈవో తిరుమలప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ సభ్యులు

రామభద్రపురం: బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆమె స్థానిక ఎంఆర్‌సీ భవనం వద్ద యూటీఎఫ్ సభ్యులతో కలిసి ఎంఈవో తిరుమలప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయని, ప్రభుత్వం విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర విద్యావ్యవస్థ రోజురోజుకూ అస్తవ్యస్తంగా మారుతోందని, కొన్నాళ్లకు ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమైపోయే పరిస్థితి కనిపిస్తోందన్నారు. విషమ పరిస్థితులు రాకముందే ప్రభుత్వం మేల్కొని, పరిస్థితులు చక్కదిద్దాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానం అమలు చేయాలన్నారు. కిలోమీటరు దూరం నుంచి వస్తున్న విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్లస్ టు పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. మినిమం టైమ్ స్కేల్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. పాఠశాలలకు రావాల్సిన అన్నిరకాల గ్రాంటులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు పి.ప్రసన్నకుమార్, యూటీఎఫ్ సభ్యులు ఎం.కేశవ, పి.సుధాకర్, ఎ.చంటి తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లు వేసేటప్పుడు జాగ్రత్తలు పాటించండి



రేగిడి: ఉప్పరనాయుడువలసలో అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ



బొబ్బిలి రూరల్: వరినాట్లు వేయడంపై అవగాహన కల్పిస్తున్న వీఏఏలు

రేగిడి: వరినాట్లు వేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని లక్ష్మీపురం, ఆడవరం, ఉప్పర్నాయుడువలస, అక్కన్న అగ్రహారం గ్రామాల్లో చేపడుతున్న ఉబాలు(వరినాట్లు వేయడం)ను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. వరినారును తొలుత శుద్ధి చేసుకోవాలని, ఆ తర్వాత నారు చివర్లు తొలగించి నాటుకోవాలని తెలిపారు. ఇలా చేయడం ద్వారా నారు చివర ఉండే పంటను పాడు చేసే పురుగు నశించి, పంటకు రక్షణ కలుగుతుందన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి, పారాది గ్రామాల్లో వరినాట్లు వేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై ఆ గ్రామ వ్యవసాయ సహాయకులు మంగళవారం అవగాహన కల్పించారు. వరినాట్లు వేసే ముందు నారు చివరభాగం తొలగిస్తే పంటను పాడుచేసే కాండం తొలిచే పురుగును సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. 20 సెంటీమీటర్ల చొప్పున కాలిబాటలు ఉండేలా చూసుకోవాలని, తద్వారా పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి పంట ఏపుగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు లత, ఉష, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలి



తెర్లాం: మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

రేగిడి: మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు వండిపెట్టాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని వండానపేట, గుళ్లపాడు, ఉంగరాడ గ్రామ పాఠశాలల్లో విద్యార్థుల కోసం సిద్ధం చేసి మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి, మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొంచెం వేడివేడిగా ఉన్నప్పుడే పదార్థాలు విద్యార్థులకు వడ్డించాలని, వంటకాలపై మూతలు పెట్టాలని, వంటగది శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు.

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంఈవోలు జె.త్రినాధరావు, ఆర్.పాపారావు సూచించారు. మండలంలోని ఆర్.గడబవలస ప్రాథమిక పాఠశాలను వారు మంగళవారం సందర్శించారు. తొలుత అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, విద్యార్థుల చేతిరాత పుస్తకాలు, హోమ్ వర్క్‌లు, అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలను పరిశీలించారు. రుచి, శుచికరంగా వంటకాలు ఉండాలని, మెనూ ప్రకారం వంటకాలు వండిపెట్టాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ఇతర సిబ్బంది అంతా హాజరుకావాలని కోరారు.

పచ్చిరొట్ట సాగుతో నేల సారవంతం



ఉప్పర్నాయుడువలసలో ట్రాక్టరు సాయంతో పచ్చిరొట్ట ఎరువు మొక్కలను నేలలో దుక్కి చేస్తున్న దృశ్యం

రేగిడి: పచ్చిరొట్ట సాగుతో నేల సారవంతమవుతుందని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని అంబకండి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, గుళ్లపాడు, ఉంగరాడ గ్రామాల్లో పచ్చిరొట్ట సాగును ఆయన మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. పచ్చిరొట్ట మొక్కలైన తర్వాత వాటిని అదే నేలలో కలియదున్ని కుళ్లబెట్టాలని తద్వారా భూసారం పెరుగుతుందన్నారు. ఆ తర్వాత అదే నేలలో మనం వేసే పంటకు కావాల్సిన పోషకాలు అదే నేల నుంచి పుష్కలంగా లభిస్తాయన్నారు. దీంతో పంట ఏపుగా పెరిగి, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అలాగే పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లు అంతగా సోకవన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం పెరిగి పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

- డీఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రామభద్రపురం: మాదకద్రవ్యాల వినియోగంతో జీవితం నాశనమవుతుందని, ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ తిరుమలరావుతో కలిసి మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన గంజాయి, ఖైనీ, గుట్కా, సారా, మద్యం వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి ఆయా మాదకద్రవ్యాలను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం తమ వద్ద ఉందని, ఈ నేపథ్యంలో రవాణా జరిగే ప్రదేశాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని తెలిపారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జ్ఞానప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



రేగిడి: విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందిస్తున్న సర్పంచ్ రమేష్‌నాయుడు



రాజాం ఉన్నత పాఠశాల వద్ద పాఠశాల సిబ్బందికి స్టూడెంట్ కిట్లు అందిస్తున్న ఎంఈవో దుర్గారావు

రేగిడి: మండలంలోని సోమరాజుపేట గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్టూడెంట్ కిట్ల పంపిణీ మంగళవారం చేపట్టారు. సర్పంచ్ సవలాపురపు రమేష్‌నాయుడు, ప్రధానోపాధ్యాయుడు ఎర్నేని అచ్యుతరావుల చేతులమీదుగా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ బోడసింగి చిన్నమ్మడు, వైస్ చైర్మన్ బూడి కుమారి, ఉపాధ్యాయులు చంద్రకళ, బి.వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్ఛేంజ్ మేళా

రాజాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద స్టూడెంట్ కిట్ల ఎక్స్ఛేంజ్ మేళా మంగళవారం నిర్వహించారు. మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేయగా మిగిలిన స్టూడెంట్ కిట్లను కిట్లు కొరత ఉన్న పాఠశాలలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో యాగాటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం

- రామభద్రపురం ఆయుర్వేద వైద్యాధికారిణి ఎస్.ఉమాదేవి



ఆరోగ్య తనిఖీలు చేస్తున్న ఆయుర్వేద వైద్యాధికారిణి ఉమాదేవి

రామభద్రపురం: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుందని ఆయుర్వేద వైద్యాధికారిణి ఎస్.ఉమాదేవి తెలిపారు. మంగళవారం స్థానిక ఆయుర్వేద ఆస్పత్రిలో పలువురు రోగులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్నిరకాల వ్యాధులకు సంబంధించి, ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. దగ్గు, చర్మవ్యాధులు, తెల్లబట్ట, కీళ్లనొప్పులు, వాతం, ఎనీమియా, గ్యాస్ట్రిక్ తదితర రోగాల నివారణకు ఆయుర్వేదంలో మందులు ఉన్నాయన్నారు. ఆయుర్వేదం మందులు వాడితే ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. ఏ వ్యాధినైనా సంపూర్ణంగా నయం చేస్తుందన్నారు. ఇంగ్లిష్ మందులు మాదిరి ఆయుర్వేద మందులతో తొందరగా రోగాలు తగ్గవని, క్రమక్రమంగా తగ్గుతాయన్నారు. ఇంగ్లిష్ మందులు వాడినప్పుడు ఒక రోగానికి మందులు వాడితే వేరొక రోగం వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఆయుర్వేద వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: స్థానిక బీసీ బాలికల వసతిగృహంలో ప్రవేశాలకు సంబంధించి, విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతిగృహ సంక్షేమ అధికారిణి నిడగంటి సరస్వతి మంగళవారం తెలిపారు. మొత్తం 100 మంది విద్యార్థులు ఉండేందుకు అవకాశం ఉంటుందని, ఇప్పటికే 61 మంది ఉండగా, మరో 39 మంది కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరుతున్నామన్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న వారంతా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇదే వసతిగృహంలో 10 శాతం ఎస్సీ బాలికలకు, మరో 5 శాతం ఎస్టీ బాలికలకు కేటాయింపులు ఉంటాయన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు



రాజాం: విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం



రాజాం: ఆరోగ్య సూచనలిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిబాబు



బొబ్బిలి రూరల్: దివ్యాంగ బాలుడికి ఫిజియోథెరపీ సేవలందిస్తున్న వైద్యుడు శ్రీకాంత్



బొబ్బిలి రూరల్: రోగులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రాజాం: పట్టణ పరిధిలోని డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. రేగిడి మండలంలోని పనసలవలస గ్రామానికి చెందిన యూఎస్ఏలో చదువుతున్న విద్యార్థులు తిరుమలరంగనాథం, వైదేహి, వీణ, శ్రీనాథ్, విద్య తదితరులు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు, వైద్య సేవలపై అభ్యసనలో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీజీఎస్ మురళీకృష్ణ తెలిపారు. ప్రతీ విద్యార్థి ఆరోగ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రోగ్రెస్ రిపోర్ట్‌లను పాఠశాలకు అందించారన్నారు.

ఆరోగ్యంపై అవగాహన..

రాజాం: చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని రాజాం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు సూచించారు. ఆస్పత్రిలోని చిన్నారుల తల్లులకు ఆరోగ్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. వర్షాకాలంలో జ్వరాలు, అంటువ్యాధులు అధికంగా ప్రబలే అవకాశాలు ఉంటాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నారులకు వేయాల్సిన టీకాలను సకాలంలో వేయించాలని, వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు జాగ్రత్త వహించాలన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం..

రేగిడి: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించి మెరుగైన ఆరోగ్యం సాధించుకోవాలని ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ సూచించారు. మండలంలోని ఖండ్యాం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించి, విద్యార్థులకు, గ్రామస్తులకు ఆరోగ్య తనిఖీలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఏ మందు ఏ రోగ నివారణకు ఉపయోగపడుతుందో వివరించారు. ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడమే కాకుండా ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు.

ఫిజియోథెరపీ సేవలు..

బొబ్బిలి రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని భవిత కేంద్రంలో దివ్యాంగులైన బాలలకు మంగళవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. వైద్యుడు శ్రీకాంత్ అక్కడికి వచ్చిన చిన్నారుల మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇక్కడ చేసిన విధంగానే ఇంటి వద్ద కూడా చేయాలని, అలా చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఇకనుంచి ప్రతీ శుక్రవారం ఫిజియోథెరపీ సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌టీలు కృష్ణమోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని కొయ్యికొండవలస, చెల్లివలస గిరిజన గ్రామాల్లో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో శిబిరానికి హాజరైన వారికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు కృష్ణకుమార్, తనూజ, ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు, సర్పంచ్ వెలంగిరి, పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్, మండల లీగల్ సెల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంలో మెలకువలపై అవగాహన



మాట్లాడుతున్న హిందుస్తాన్ పెట్రోలియం ఏరియా సేల్స్ మేనేజర్ శ్రీహర్ష

బొబ్బిలి: వంటగ్యాస్ వినియోగంలో మెలకువలు పాటిస్తే ఎక్కువ కాలం గ్యాస్ వస్తుందని హిందుస్థాన్ పెట్రోలియం ఏరియా సేల్స్ మేనేజర్ కె.శ్రీహర్ష తెలిపారు. స్థానిక సూర్య రెసిడెన్సీలో సఖి పేరిట స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వంటగ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు, మెలకువలు, ఇంధన పొదుపు, అగ్ని ప్రమాదాల నివారణ వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే స్వయం ఉపాధి సాధనపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. గ్యాస్ లీకేజీ వస్తున్నప్పుడు అప్రమత్తమై నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంధనాలను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. శిక్షణార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ పొందినట్లు బుధవారం ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల గ్యాస్ డీలర్లు జలగం ప్రసాదరావు, పెంటపాటి సాయికిరణ్, అనిల్, హర్ష తదితరులు పాల్గొన్నారు.